నిధులున్నా.. పనులేవీ ?

- అభివృద్ధికి నోచని వినాయక పార్కు
- ప్రధానగేటు ధ్వంసం.. పార్కులో వాహనాల పార్కింగ్



శిలాఫలకం



వెంకటరమణ కాలనీలో వినాయక పార్కుకు గేటు లేని దృశ్యం



పార్కు ప్రహరీ దుస్థితి

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధి వెంకటరమణ కాలనీలోని వినాయక పార్కు నిరుపయోగంగా మారింది. పార్కు అభివృద్ధి కోసం రూ.8 లక్షల నిధులు కేటాయించినా అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. గతంలో ఈ పార్కు ప్రహరీ ధ్వంసం కాగా, ప్రధాన గేటును కూడా తొలగించారు. పార్కులో కనీస వసతులు కల్పించలేదు. ఇక పిచ్చిమొక్కలు, చెత్త చెదారం పేరుకుపోయింది. కొంతమంది ఇష్టానుసారంగా పార్కులో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని పత్రికల్లో కథనాలు రాసినప్పుడు అధికారులు పార్కు గేటుకు తాళం వేశారు. నగరంలోని పార్కులను జీహెచ్‌ఎంసీ అధికారులు అభివృద్ధి చేస్తున్న క్రమంలో వెంకటరమణ కాలనీలోని వినాయక పార్కుపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

- పార్కు అభివృద్ధి కోసం రూ.8 లక్షల నిధులతో ఎమ్మెల్యే గాంధీ గత రెండు నెలల క్రితం శంకుస్థాపన చేశారు.
- అయితే ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.

వెంటనే పనులు చేపట్టాలి



పార్కు అభివృద్ధి కోసం రూ.8 లక్షల నిధులు కేటాయించారు. రెండు నెలల గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. ప్రహరీ గోడ నిర్మించి ప్రధాన గేటును ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా అధికారులు పనులు ప్రారంభించాలి.

– రాజు, వెంకటరమణ కాలనీ

వాహనాల పార్కింగ్‌ను అడ్డుకోవాలి



పార్కులలో కనీస వసతులు ఏర్పాటు చేసి ప్రజలు సేద తీరడానికి కృషి చేయాలి. పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి.

– శివ శ్రీనివాస్, వెంకటరమణ కాలనీ

- పార్కు ప్రహరీ ,ప్రధాన గేటు పాడయ్యాయి.
- చిన్నారులు ఆడుకోవడానికి వస్తువులు లేవు
- పార్కుకు వచ్చే వారికి తాగడానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

స్టేడియంలో మేళాల నిర్వహణ.. ఇబ్బందులు



వాహనాల పార్కింగ్ స్థలంలో దుకాణాల ఏర్పాటు

హఫీజ్‌పేట్ : చందానగర్ పీజేఆర్ స్టేడియంలో జీహెచ్‌ఎంసీ అధికారులు మేళాలకు అనుమతులు ఇవ్వడంతో ఇబ్బందులుపడాల్సి వస్తోందని క్రీడాకారులు, చిన్నారులు, వృద్ధులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాలలో వాకింగ్, వ్యాయామం చేయడానికి స్థలం లేకుండా పోయిందని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు ఆడుకునే చోట భారీగా టెంట్లు వేసి ఇష్టానుసారంగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. రోజుల తరబడి మేళాలు, పాఠశాలల సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తుంటే నిత్యం స్టేడియంకు వచ్చే వారు అవస్థ పడుతున్నారు. వారం రోజుల పాటు మేళాలకు అనుమతులు ఇస్తే ఎలా అని వాపోతున్నారు. పార్కింగ్ స్థలంలో దుకాణాలు ఏర్పాటుతో వాహనాలు బయట పార్క్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు మేళాలను నిలిపివేయాలని వాకర్స్ కోరుతున్నారు.



కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 70, దొండ 60, దోస 40, ఆలు 25, చామ 60, కీర 30, బీర 70, వంకాయ 50, గోకర 70, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 60, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 250.

'మనూ' దూరవిద్య కోర్సుల గడువు పెంపు

రాయదుర్గం: మనూలో దూరవిద్య కోర్సుల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించడం జరిగిందని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ బుధవారం తెలిపారు. దూరవిద్యాకోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకోసం 'మనూ' వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీలు

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు

పటాన్‌చెరు టౌన్: ఆరు గ్యారంటీల పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ గడ్డం బాలమణి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో బన్సీలాల్ మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలంలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. అధికారులు ఇచ్చిన రసీదును భద్రపరచాలని, ఇంటికి ఎంక్వయిరీ వచ్చిన సమయంలో ఆ రసీదును చూపించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సుప్రజ,ఎంపీపీ సుష్మశ్రీ,ఇస్నాపూర్ గ్రామ ఉపసర్పంచ్ శోభ ,వార్డు సభ్యులు,ఎంపీటీసీ, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం




శిక్షణా కార్యక్రమానికి హాజరైనకానిస్టేబుళ్లు



మాట్లాడుతున్న ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్

గచ్చిబౌలి: ఆర్టీసీ భద్రతలో కానిస్టేబుళ్ల విధులు కీలకంగా ఉంటాయని ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వి.రవీందర్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్‌లోని టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో ఆర్టీసీ కానిస్టేబుళ్లకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని కమాండెంట్ సన్నీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావంతో పని చేయాలని సూచించారు. కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ శిక్షణలో విధుల పట్ల అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, శ్రీకాంత్, టీఎస్‌ఆర్టీసీ ఈడీ (అడ్మిన్) మహంకాళి, డాక్టర్ జ్యోతిరావు పూలే, డి.నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి పాజిటివ్



గచ్చిబౌలి: కొవిడ్ టెస్టులలో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగినిరెడ్డి తెలిపారు. బుధవారం 20 మందికి రాపిడ్ యాంటిజెన్ టెస్టులు చేయగా ఒకరికి పాజిటివ్ తేలిందన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, ఒంటి నొప్పులు తగ్గకుండా ఉన్న వారు కొవిడ్ టెస్టులు చేయించుకోవాలని ఆమె సూచించారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 31 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా 31 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

కోర్ ఇంజనీరింగ్‌కు మంచి భవిష్యత్తు

పటాన్‌చెరు టౌన్: కృత్రిమ మేధ ప్రభావం చూపుతున్న నేపథ్యంలో,సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ వంటి కోర్ ఇంజనీరింగ్ బ్రాంచీలకు ప్రాధాన్యం పెరుగుతోందని గీతం అధ్యక్షుడు భరత్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'టన్నెలింగ్ 'పై బుధవారం నిర్వహించిన ఒక రోజు వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... కృత్రిమ మేధ కంప్యూటర్ సైన్స్ ఉద్యోగాలపై క్రమంగా ప్రభావం పడుతోందన్నారు. జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్‌ఎండీసీ)భవిష్యత్తు ప్రణాళికలు, ప్రస్తుతం నవరత్న హోదా మహారత్నగా మారబోతున్న విషయాన్ని ఆ సంస్థ జనరల్ మేనేజర్ (పరిశోధన,అభివృద్ధి) ఎస్.కె.చౌరాసియా చెప్పారు. సింగరేణి కాలరీస్ పూర్వ డీజీఎం సత్యనారాయణ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) తెలంగాణ విభాగం పూర్వ అధ్యక్షుడు బ్రహ్మరెడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలువురు అధ్యాపకులు, కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

శోభాయాత్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోనీ ఆలయాలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కాలనీలో శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు.అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను భక్తులతో కలిసి పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు.మరుసటి రోజున ఈ అక్షింతలను భక్తులకు పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సావిత్రీబాయి పూలేకు ఘన నివాళి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, ప్రజా సంఘాల నాయకుడు శోభన్ మాట్లాడుతూ భారతదేశ చదువుల తల్లిగా గుర్తింపు పొందిన సావిత్రీబాయి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. మహిళా అక్షరాస్యత కోసం ఆమె చేసిన కృషి నేటి సమాజానికి ఎంతగానో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు విజయ్ రవి, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : భావితరాలకు సావిత్రీబాయిపూలే ఆదర్శప్రాయురాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ కృష్ణమాల్ అన్నారు. మియాపూర్‌లోని స్టాలిన్‌నగర్‌లో ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భాగ్యమ్మ, పుష్ప, మురళి, లావణ్య, రాణి,,సుల్తానాబేగం తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

ఎమ్మెల్యే గాంధీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసిన కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

రాయదుర్గం: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలోబీఆర్‌ఎస్ నాయకులు జంగయ్య యాదవ్, రమేష్‌గౌడ్, నారాయణ, రాజుముదిరాజ్, అనీల్‌కుమార్,గోవింద్, శ్రీశైలం పాల్గొన్నారు.

గాంధీని కలిసిన కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్ : ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాంధీకి శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు



తారానగర్‌లో బాక్స్ టైప్ డ్రైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎస్‌ఈ శంకర్ నాయక్, ఈఈ శ్రీనివాస్ తదితరులు

అభివృద్ధి పనుల పరిశీలన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. శేరిలింగంపల్లి జోన్ ఎస్‌ఈ శంకర్ నాయక్, సర్కిల్ ఈఈ శ్రీనివాస్‌లతో లింగంపల్లి బాక్స్ టైప్ కల్వర్టు, తారానగర్‌లో చేపట్టిన బాక్స్ టైప్ డ్రైన్ పనులను పరిశీలించి సూచనలు చేశారు. నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశంగౌడ్, నాయకులు హబీబ్, గడ్డం రవియాదవ్, గోపాల్ యాదవ్, అజీమ్, వెంకటరమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ విద్య అందించే దిశగా కృషి చేయాలి

రాయదుర్గం: మూడేళ్ల కాలంలో 2023–24 నుంచి 2025–26 వరకు 15 లక్షల మంది ఫ్యాకల్టీ సభ్యులకు అవగాహ కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్- మాలవ్య మిషన్ టీచర్స్ ట్రెనింగ్ సెంటర్ (యూజీసీ-ఎంఎంటీటీసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నూతన జాతీయ విద్యావిధానం -2020పై యూజీసీ-ఎంఎంటీటీసీ ఆధ్వర్యంలో 8 రోజులపాటు నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సంపూర్ణ విద్యను అందించడం, భారతదేశం-కేంద్రీకృత నైతికత, విలువల యొక్క ఆదర్శాలను గ్రహించడం, కొత్త బోధనా పద్ధతులను రూపొందించడం, విమర్శనాత్మక ఆలోచనను అభివృద్ధి చేయడం, అభ్యాస ప్రక్రియలో ఐసీటీ సాధనాలను ఏకీకృతం చేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం జనవరి 11వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థలకు చెందిన ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: గురుకులాల్లో 2024 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జనవరి 6వ తేదీతో ముగుస్తుందని పటాన్‌చెరు మండలం చిట్కుల్ గురుకుల వసతిగృహం ప్రిన్సిపల్ ప్రమోద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.జనవరి 6 లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు.ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్

- పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా నిలుస్తుందని కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం రుద్రారం, పాశమైలారం గ్రామాలలో నిర్వహించిన ప్రజా పాలనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దరఖాస్తుల స్వీకరణ జనవరి 6వ తేదీ వరకు ఉంటుందన్నారు. పేదలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల్ ప్రెసిడెంట్ సుధాకర్‌గౌడ్, ఎంపీటీసీలు గడ్డం శ్రీశైలం, హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఉపసర్పంచ్ యాదయ్య, మాజీ సర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు సందీప్‌గౌడ్, లక్ష్మారెడ్డి ,గోపాల్, నాయకులు ఆదిత్యరెడ్డి, అచ్యుతరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంపత్, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డా. మహ్మద్ జావేద్ అలీకి జేసీబోస్ ఫెలోషిప్



రాయదుర్గం: ప్రతిష్టాత్మకమైన జేసీ బోస్ నేషనల్ ఫెలోషిప్–2023ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ జావేద్ అలీ అందుకున్నారు. నగరంలోని ఎల్‌విప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లోని డాక్రియాలజీ హెడ్‌గా అలీ పనిచేస్తున్నారు. ఆయన హెచ్‌సీయూలో ప్రొఫెసర్ నడింపల్లి శివకుమార్ మార్గదర్శకత్వంలో బయోకెమిస్ట్రీ విభాగంలో 'హ్యూమన్ లాక్రిమల్ డ్రైనేజ్ సిస్టమ్ యొక్క గ్లైకోబయాలజీని అన్వేషించడం' అనే అంశంపై పీహెచ్‌డీ డిగ్రీని పొందారు. డాక్టర్ జావేద్‌అలీ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన క్లినిషియన్–సైంటిస్ట్‌గా కొనసాగుతున్నాడు. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన అందిస్తున్నామని, మహనీయుల ఆశయాలు సదా ఆచరణీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన, వర్తక సంఘం నూతన కార్యాలయ ప్రారంభోత్సవం, జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సద్ది ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల వెంకటేశ్‌గౌడ్, సర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌లో 28,745 దరఖాస్తులు



హఫీజ్‌పేట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉపకమిషనర్ వంశీ కృష్ణ

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి/ హఫీజ్‌పేట్: ప్రజాపాలనకు ప్రజల నుంచి స్పందన బాగా వస్తోంది. బుధవారం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలో 28,745 దరఖాస్తులు మొత్తం స్వీకరించారు. అందులో అభయహస్తం కోసం 19,897 దరఖాస్తులు రాగా, ఇతర అంశాలపై 8,848 వచ్చాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజాపాలన కోసం శేరిలింగంపల్లిలోని చందానగర్, శేరిలింగంపల్లి, యూసుఫ్‌గూడ, పటాన్‌చెరు, ఆర్‌సీపురం సర్కిళ్ల పరిధిలోని ప్రజాపాలన కేంద్రాలలో స్వీకరించారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో 6,420 దరఖాస్తులు

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రజాపాలన కేంద్రాలలో మొత్తం 6,420 దరఖాస్తులు వచ్చాయి. అందులో అభయహస్తం కోసం 4,420 దరఖాస్తులు, ఇతర అంశాలపై 2000 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కాగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రజాపాలనా కేంద్రాలను డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులను ఆయన పరిశీలించారు.

చందానగర్ సర్కిల్‌లో 6,228 దరఖాస్తులు

చందానగర్ సర్కిల్ పరిధిలో మొత్తం 6,628 దరఖాస్తులు స్వీకరించారు. అందులో అభయహస్తం దరఖాస్తులు 4,261 కాగా, ఇతర అంశాలపై వచ్చిన దరఖాస్తులు 1,967 ఉన్నాయి.

ప్రజాపాలన కేంద్రాల పరిశీలన

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని హఫీజ్‌పేట్, చందానగర్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని ప్రజా పాలన కేంద్రాలను ఉపకమిషనర్ వంశీకృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో దరఖాస్తులపై అధికారులను ఆరా తీశారు. కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. దరఖాస్తులు తీసుకున్న వెంటనే రశీదులు అందించాలన్నారు.

మంచినీటి వాల్వ్‌ల లీకేజీ



ఆస్‌బెస్టాస్ కాలనీలో లీకేజీతో రోడ్డుపై పారుతున్న మంచినీరు

ఆల్విన్‌కాలనీ: తాగునీటి పైపులైన్ వాల్వ్‌ల లీకేజీలతో మంచినీరు రోడ్డుపై ఏరులై పారుతున్నాయి. కూకట్‌పల్లి ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రధాన రహదారిలో మసీదు వద్ద లీకేజీతో సుమారు వారం రోజులుగా నీరు వృధాగా పోతోంది. ప్రతిసారి తూతూ మంత్రంగా మరమ్మతులు చేయటంతో చేసిన మూణ్నాళ్లకే సమస్య పునరావృత్తమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ లీకేజీల వల్ల కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిత్యం ఈ రహదారిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ఆ విభాగం సిబ్బంది సైతం రాకపోకలు సాగిస్తుంటారని, సమస్య కనపడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.